'ప్రజావాణి'కి 94 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, డిసెంబర్ 16 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 94 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లోనే దవాఖాన నిర్మించాలి

ముప్కాల్, డిసెంబర్16: ముప్కాల్‌లోనే ప్రభుత్వ దవాఖాన నిర్మించాలని కోరుతూ ముప్కాల్ గ్రామ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందించారు. గ్రామ పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రభుత్వ దవాఖాన నిర్మాణానికి అనువైన స్థలం లేదనే సాకుతో వేరే గ్రామాలకు తరలించేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ గ్రామ పరిరక్షణ సమితి సభ్యులు నేర బాబూరావ్, సంజీవ్ థామస్, కల్లు స్వామి, కంచు గంగాధర్, శంకర్ పటేల్, కట్ట గోపి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

వేల్పూర్, డిసెంబర్ 16: పోచంపల్లిలో ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సుమారు అర ఎకరం ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దానిని రద్దు చేయాలని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్టాండ్ ప్రాంగణం శుభ్రం

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన...

బస్టాండ్‌పై పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కార్మికులు

పోతంగల్, డిసెంబర్ 16 : పోతంగల్ బస్టాండ్ అధ్వాన పరిస్థితిపై నమస్తే తెలంగాణ దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తకు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. బస్టాండ్ వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ లీకేజీకి మరమ్మతులు చేయించారు. బస్టాండ్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను కార్మికులతో తొలగించపజేసి, పరిసరాలను శుభ్రం చేయించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి, డిసెంబర్ 16 : కోటగిరి మండలం రాంపూర్ గ్రామంలో సోమవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత శాఖ అధికారులకు అప్పగించామని ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్‌యూ నాయకుల అరెస్టు

జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో పీడీఎస్‌యూ నాయకుడు

డిచ్‌పల్లి/ జక్రాన్‌పల్లి, డిసెంబర్ 16 : చలో అసెంబ్లీలో భాగంగా అసెంబ్లీకి వెళ్లకుండా పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు సోమవారం తెల్లవారుజామునే అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు నిధులు మంజూరు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చోటుచేసుకుంటున్న ఫుడ్ పాయిజన్‌పై విచారణ చేయించాలని పీడీఎస్‌యూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. డిచ్‌పల్లి పోలీసులు టీయూ పీడీఎస్‌యూ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జక్రాన్‌పల్లిలో అర్గుల్‌కు చెందిన పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడితోపాటు పలువురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోవడంతోనే ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా విద్యా శాఖ మంత్రిని నియమించలేదని అన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బందిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ పీడీఎస్‌యూ నాయకుల అరెస్ట్‌ను పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ఖండించారు.

అరెస్టులతో పోరాటాలను ఆపలేరు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్16 : అక్రమ అరెస్టులతో తమ పోరాటాలను ఆపలేరని పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్ అన్నారు. రాష్ట్రంలో పీడీఎస్‌యూ నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిఖిల్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్‌పై విచారణ జరిపించాలని, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు సిద్ధు, వినయ్, నితిన్, నిఖిల్, సింహాద్రి, తిరుపతి పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో సుంకరి గంగాధర్‌కు డాక్టరేట్

గంగాధర్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 16 : వేల్పూర్ మండలం వాడి గ్రామానికి చెందిన సుంకరి గంగాధర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా ప్రకటించింది. సారంగాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుంకరి గంగాధర్.. తెలంగాణ స్మృతి కవిత్వం సమగ్ర పరిశీలన అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ప్రసిద్ధ కవి, పరిశోధకుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం పర్యవేక్షణలో సుంకరి గంగాధర్ పరిశోధన జరిపారు. ఓయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకర్ శర్మ, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఖాసీం, డాక్టర్ రఘు, ఆచార్య వారిజా రాణి, డాక్టర్ సల్ల సత్యనారాయణ, డి.గోపాల్, ఘనపురం దేవేందర్, డాక్టర్ భాగ్యలక్ష్మి గంగాధర్‌ను అభినందించారు.

బిల్లుల సాధన కోసం పోరాటమే ఏకైక మార్గం

- మాజీ సర్పంచులందరూ సమష్టిగా సమాయత్తం కావాలి
- మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మెట్టు అశోక్ పిలుపు

మెట్టు అశోక్

సారంగాపూర్, డిసెంబర్ 16 : తమ పదవీకాలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు పొందేందుకు పోరాటమే ఏకైక మార్గమని మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, ఆకుల కొండూర్ మాజీ సర్పంచ్ మెట్టు అశోక్ అన్నారు. జిల్లాలోని తాజా, మాజీ సర్పంచ్‌లందరూ సమష్టిగా ప్రభుత్వంపై పోరాడేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం సెల్ఫీ వీడియో విడుదల చేయగా.. వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయ్యింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినప్పటికీ, మాజీ సర్పంచులకు రావాల్సిన బిల్లులకు సంబంధించిన నిధులు ఇంతవరకు మంజూరు కాలేదని, ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మాజీ సర్పంచులు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా పోలీసులతో అరెస్ట్ చేయడంపై మండిపడ్డారు. రాత్రివేళలను చూడకుండా పోలీసులను ఇండ్ల వద్దకు పంపించి, ఇప్పటి వరకు మూడుసార్లు ప్రభుత్వం మాజీ సర్పంచులను అరెస్ట్ చేయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచులందరూ ఏకమై ప్రతి మండలంలో ఒకసారి శాంతియుతంగా వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఈ విధంగా అరెస్ట్‌ల నిర్బంధాన్ని కొనసాగించలేదని గుర్తుచేశారు.

బిల్లులు చెల్లించాలని కోరితే అరెస్టులా ..

బోధన్ రూరల్, డిసెంబర్ 16: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని కోరితే అరెస్ట్ చేయడం సిగ్గుచేటని మాజీ సర్పంచులు అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో బోధన్ మండలంలోని మాజీ సర్పంచులను ఆదివారం రాత్రి ముందస్తుగా బోధన్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ.. గతంలో అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించామని అన్నారు. వాటికి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించమంటే ముందుగా అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కోర్వ గంగాధర్, సిర్పా సుదర్శన్, చింతం నాగయ్య, మందర్న గంగాధర్, సుదర్శన్, తారాచంద్ తదితరులున్నారు.

స్వయం ఉపాధి శిక్షణ సర్టిఫికెట్ల అందజేత

సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన మహిళలు

కోటగిరి, డిసెంబర్ 16 : మండల కేంద్రంలో 30 రోజుల పాటు కొనసాగిన బ్యూటీపార్లర్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సోమవారంతో ముగిసింది. శిక్షణ పొందిన 34 మందికి ఆర్‌సీటీ శిక్షకుడు రామకృష్ణ సర్టిఫికెట్లు, కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రమేశ్‌బాబు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ బ్రెయిన్ యోగాతో విద్యార్థుల్లో చురుకుదనం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అందె జీవన్‌రావు

డిచ్‌పల్లి, డిసెంబర్ 16 : సూపర్ బ్రెయిన్ యోగాతో విద్యార్థుల్లో చురుకుదనం పెరుగుతుందని రాష్ట్ర అవార్డు గ్రహీత, గుంజిళ్ల మాస్టర్ అందె జీవన్ రావు అన్నారు. మండలంలోని సుద్దులం జడ్పీహెచ్‌ఎస్‌లో 'సూపర్ బ్రెయిన్‌యోగా'పై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. సూపర్ బ్రెయిన్ యోగా అనేది గుంజిళ్ల మెరుగైన విధానమని, ఈ యోగాతో మెదడు చురుకుదనం పెరిగి, జ్ఞాపకశక్తి మెరుగుడపతుందని తాజా పరిశోధనలు తెలియజేస్తున్నాయని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోజూ ప్రార్థనా సమయంలో విద్యార్థులతో సూపర్ బ్రెయిన్ యోగా చేయించాలని సూచించారు. కళాశాల విద్యార్థులతో 14 రౌండ్లు సూపర్‌బ్రెయిన్ యోగా అంశంపై సమర్పించిన పరిశోధనా పత్రాలను హెచ్‌ఎం గంగారానికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, ప్రదీప్, తిరుపతిరావు, సాయన్న, భారతి, నీలా బాయి, సునీత, వ్యాయామ ఉపాధ్యాయుడు రమేశ్ పాల్గొన్నారు.

చందూర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు

- పెట్రోలింగ్ చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు

చందూర్, డిసెంబర్ 16 : మండలకేంద్రంలో తరచూ అనుమానాస్పద వ్యక్తులు రాత్రి వేళల్లో సంచరిస్తున్నారని, పోలీసులు పెట్రోలింగ్ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. విఘ్నేశ్వర కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఓ మహిళ అనుమానాస్పదంగా తిరుగుతుండడాన్ని కాలనీవాసులు గమనించి పట్టుకున్నారు. తాను పూలకోసం వచ్చానని చెప్పడంతో వదిలేశారు. కొన్ని రోజుల క్రితం ముగ్గురు వ్యక్తులు గడ్డపారలు పట్టుకొని గ్రామంలో తిరుగుతుండడాన్ని గమనించిన గ్రామస్తుడు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల విఘ్నేశ్వర కాలనీలో మాముళ్ల శ్రీనివాస్ ఇంట్లో దొంగలు పడి ఏడున్నర తులాల బంగారం, 5 తులాల వెండి, డబ్బులు చోరీ చేశారు. తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తున్నారని, పోలీసులు పెట్రోలింగ్ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బైక్‌పై నుంచి కిందపడి ఒకరి మృతి

డిచ్‌పల్లి, డిసెంబర్ 16 : మండలంలోని సాంపల్లి గ్రామానికి చెందిన మర్కంటి జంగన్న (55) బైక్‌పై నుంచి పడి మృతిచెందాడు. ఎస్సై షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగన్న ఆదివారం డిచ్‌పల్లి నుంచి సాంపల్లికి బైక్‌పై వెళ్తుండగా సీఎంసీ కళాశాల వద్ద అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మోపాల్ (ఖలీల్‌వాడి), డిసెంబర్ 16 : బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై యాదిగిరి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం దూస్‌గాం గ్రామానికి చెందిన రాములు సోమవారం మోపాల్ మండలం కంజర-కులాస్‌పూర్ రోడ్డుపై వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో రాములు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

వినాయక్‌నగర్, డిసెంబర్ 16 : నగరంలోని లైన్‌గల్లీకి చెందిన షేక్ ఇమ్రాన్ (30) సోమవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూ టౌన్ ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇమ్రాన్ కొంతకాలంగా మద్యానికి బానిసగా మారి, ఎలాంటి పనిచేయకుండా తిరుగుతుండేవాడని అతడి భార్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. తాగుడుకు డబ్బులు లేక పోవడంతో రెండు రోజుల క్రితం ఇంట్లో భార్యతో గొడవపడి, ఆమెను మాలపల్లిలోని తన పుట్టింటికి పంపించాడు. అనంతరం అతడు మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ తగాదాలతో మహిళ ..

మోపాల్ (ఖలీల్‌వాడి), డిసెంబర్ 16 : మోపాల్ మండలంలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన పల్లికొండ పోసాని కుటుంబ తగాదాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. వ్యవసాయభూమి సాగు చేసుకుంటున్న విషయంలో డబ్బుల విషయంలో ఈనెల 13న గొడవపడి, ఇంట్లో నుంచి వెళ్లినట్లు మృతురాలి కూతురు స్వప్న తెలిపింది. ఈనెల 15న న్యాల్‌కల్ చెరువులో మృతదేహం తేలడంతో జాలర్లు గమనించి, కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యభిచార గృహంపై సీసీఎస్ టీం దాడి

వినాయక్‌నగర్, డిసెంబర్ 16: నిజామాబాద్ మండల పరిధిలోని పాంగ్రా బోర్గాం పరిధిలో ఉన్న ఓ ఇంట్లో వ్యభిచార గృహంపై సీసీఎస్ పోలీస్ టీం సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించింది. సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, ముగ్గురు మహిళలతో పాటు ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,500 నగదును స్వాధీనం చేసుకొని, పట్టుబడిన వారిని ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పట్టుబడిన మహిళలకు కౌన్సెలింగ్ నిమిత్తం ఎస్సై శ్రీకాంత్ సఖీ సెంటర్‌కు పంపించారు. విటుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నీరడి లక్ష్మణ్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 16 : మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లాకు చెందిన నీరడి లక్ష్మణ్ నియామకమయ్యారు. ఆయనకు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. రెండేండ్ల పాటు పదవిలో కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. మూడు నెలల్లో రాష్ట్ర, జిల్లా కమిటీలను వేయాలని సూచించారు.

సంక్షిప్తంగా..

- **బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం** - డిచ్‌పల్లి, డిసెంబర్ 16 : మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన మేకల హరీశ్ దుబాయ్‌లో పదిరోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన యువజన సంఘాల సభ్యులు రూ.62,300 జమచేశారు. మృతుడి భార్య రాజమణికి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో డబ్బులను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ. 5 లక్షలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు వినోద్‌రెడ్డి, రాజు, ఆనంద్, అబ్బన్న, బుజ్జి, సృజన్ పాల్గొన్నారు.
- **గ్రంథాలయ అభివృద్ధి కోసం రూ. 5 లక్షలు మంజూరు** - ధర్పల్లి, డిసెంబర్ 16 : మండలకేంద్రంలోని గ్రంథాలయ అభివృద్ధికి జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి రూ. 5 లక్షలు మంజూరైనట్లు గ్రంథపాలకుడు కిషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోరు, నల్లాల ఏర్పాటు, బాత్‌రూమ్‌లు, వైరింగ్ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.
- **బాపూజీ వచనాలయం కార్యదర్శిగా బాధ్యతల స్వీకరణ** – సుభాష్‌నగర్, డిసెంబర్ 16 : జిల్లాకేంద్రంలోని బాపూజీ వచనాలయం కార్యదర్శిగా మీసాల సుధాకర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ హాజరై ఆయనను అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు భక్తవత్సలం, కోశాధికారి గంగాధర్‌రావు, ఉపాధ్యక్షులు దేవదాస్, బోగ అశోక్, మాజీ అధ్యక్షుడు బంటు రాజేశ్వర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
- **అంతర్జాతీయ చాయ్ దినోత్సవం** -ఆర్మూర్‌టౌన్, డిసెంబర్16: ఆర్మూర్ పట్టణంలో సోమవారం వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద అంతర్జాతీయ చాయ్ దినోత్సవాన్ని నిర్వహించారు. చాయ్ అనేది నిత్య జీవితంలో ఒక భాగంగా మారిందని లయన్ నివేదన్ గుజరాతి అన్నారు.
- **అభివృద్ధి పనులకు నిధులు మంజూరు**- ఏర్గట్ల, డిసెంబర్ 16: మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎస్‌డీఎఫ్ నుంచి నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ తెలిపారు. మండల కేంద్రంలో పలు పనులకు సోమవారం నాయకులు భూమిపూజ నిర్వహించారు. మండల కేంద్రంలో జక్కని ముదిరాజ్ సంఘ భవనం వద్ద సీసీ డ్రైనేజీ, రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తుల కోసం రేకుల షెడ్డు, తొర్తి గ్రామంలో వీరహనుమాన్ ఆలయం వద్ద కాల్వకు సైడ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు.
- **సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక**- ఆర్మూర్‌టౌన్, డిసెంబర్16: పట్టణంలోని జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో సోమవారం సీనియర్ సాఫ్ట్‌బాల్ పురుషులు, మహిళల ప్రాబబుల్స్ జట్లను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మార్కంటి గంగామోహన్ సోమవారం తెలిపారు. ఎంపికైన జట్లకు జనవరి మొదటి వారంలో శిక్షణ శిబిరం నిర్వహించి ఫైనల్ జట్టును ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.
- **పాఠశాలకు కంప్యూటర్ల వితరణ**- ఆర్మూర్‌టౌన్, డిసెంబర్16: పట్టణంలోని రాంమందిర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.45వేల విలువైన కంప్యూటర్‌ను సాయికృష్ణ అనే యువకుడు వితరణ చేసినట్లు హెచ్‌ఎం గంగారాం సోమవారం తెలిపారు. దాతకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.
- **ఏబీవీపీ బోధన్ పట్టణ అధ్యక్షుడిగా శ్రీరాం** - బోధన్, డిసెంబర్ 16: ఏబీవీపీ బోధన్ పట్టణ అధ్యక్షుడిగా అడ్లూరి శ్రీరాంను నియమించినట్లు ఆ సంఘం ఇందూర్ జిల్లా ప్రముఖ్ తలాండే ఈశ్వర్ కుమార్, ఇండ్ల సూర్య కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ పట్టణ అధ్యక్షుడిగా అడ్లూరి శ్రీరాంతోపాటు, వర్ని మండల అధ్యక్షుడిగా పైసా వినోద్‌ను నియమించినట్లు వెల్లడించారు. ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహించిన విభాగ్ అభ్యాసవర్గలో వీరిని నియమించారని తెలిపారు.
- **పాఠశాలలకు డ్యూయల్ డెస్క్‌ల వితరణ**- రెంజల్, డిసెంబర్ 16: మండలంలోని నీలా జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు 15 చొప్పున డ్యూయల్ డెస్కులను ఆర్మూర్‌కు చెందిన వసంత టూల్స్ షాపు నిర్వాహకుడు దయానందరెడ్డి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఇల్తేపు శంకర్,శ్రీరాంనాయక్, నీలాయూత్ సభ్యులు పాల్గొన్నారు.
- **పనుల పరిశీలన** - ఆర్మూర్‌టౌన్, డిసెంబర్16: పట్టణంలోని మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో సోమవారం బ్లేడు ట్రాక్టర్లతో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. ఈ పనులను మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్నా పరిశీలించారు.

21, 22వ తేదీల్లో జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు

మోర్తాడ్, డిసెంబర్ 16: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 21, 22 తేదీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. విజేతలకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలతోపాటు ట్రోఫీలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 19వ తేదీ వరకు పీఈటీ సింధుజ 9603306171 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

నేడు యాసంగి పంటలసాగుపై అవగాహన

మాక్లూర్, డిసెంబర్16: యాసంగి పంటల సాగుపై మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు ఏవో పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల హాజరు కావాలని ఆమె సూచించారు.

రెండు వేర్వేరు కేసుల్లో నలుగురికి శిక్షలు ఖరారు

శక్కర్‌నగర్, డిసెంబర్ 16: బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు వేర్వేరు కేసుల్లో నలుగురికి శిక్షలు ఖరారు చేస్తూ బోధన సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పశాయి సోమవారం తీర్పు చెప్పారు. బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన ఇద్దరు యువకులకు రెండు రోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పగా, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన మరో ఇద్దరితో రెండు రోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛంద పారిశుద్ధ్య కార్యక్రమాలు చేయించాలని అధికారులను ఆయన ఆదేశించారు. పట్టణ సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ యువకులు, ప్రజలు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని, వీరికి న్యాయస్థానం శిక్షలు వేస్తుందని అన్నారు.

గోదాం నిర్మాణ పనులకు భూమిపూజ

భూమి పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి

రెంజల్, డిసెంబర్ 16: రెంజల్ సహకార సంఘం పరిధిలోని బోర్గాం గ్రామంలో 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మాణం కోసం సోమవారం డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, రెంజల్ విండో చైర్మన్ మొహినుద్దీన్‌తో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ మోబిన్‌ఖాన్, డైరెక్టర్లు బుడొళ్ల సాయిలు, అగ్గు నారాయణ, ఖదీర్‌పాషా, సావిత్రి, చంద్రకళ,సీఈవో ఇంద్రసేన, ఎంఎల్‌రాజు, నితిన్, కార్తీక్, ఇందిరారెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బాల్కొండ, డిసెంబర్ 16: అక్రమంగా రవాణా చేస్తున్న 37.20 క్వింటాళ్ల పీడీ